చిన్నశేష వాహనంపై దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః
జూబ్లీహిల్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం ఉదయం వేంకటేశ్వర స్వామి ఐదు తలల చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల కోలాటాలు, మంగళ వాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ వాహనసేవ అత్యంత రమణీయంగా ముందుకు సాగింది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామి భక్తులను కటాక్షించారు. వాహనసేవలో అర్చకులు, ఏఈవో రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్స్ నిరంజన్, హరికృష్ణ, పలువురు అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిన్న శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు, పాల్గొన్న ఆలయ అధికారులు.

హైదరాబాద్ వార్త

చార్మినార్,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :
ఆకాశంలో బుధవారం రాత్రి నెల వంక దర్శనమివ్వటంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. రంజాన్ నెల ప్రారంభం కావటంతో ముస్లింలు ఒకరికి ఒకరూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. బుధవారం రాత్రి ఆకాశంలో నెల వంక కనిపించటంతోరంజాన్ మాసం ప్రారంభమైందని మక్కామసీదు మాజీ సూపరిండెంట్ తెలిపారు. చారిత్రక మక్కామసీదులో బుధవారం రాత్రి జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ప్రేమ, కరుణ, దయ, సహనం, దాతృత్వం, సోదర భావం, క్రమశిక్షణ, ధార్మిక చింతనకు ప్రతి రూపం పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఉంటారు. సాయంత్రం వేళల్లో ఉపవాసాలు విడిచి పెట్టిన అనంతరం కుటుంబ, సభ్యులు, బంధువులతో కలిసి ఇఫ్తార్ విందులలో పాల్గొంటారు. కాగా రంజాన్ మాసంలో చారిత్రక మక్కామసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. రాష్ట్ర మైనార్టీ విభాగం ఆధ్వర్యం లోఎటువంటి అసౌకర్యం కలగకుండ కావలసిన ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండ ప్రస్తుతం మక్కామసీదు వద్ద ఉన్న మూడు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లతో పాటు అదనంగా మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ అధికారులు నెలకొల్పారు. అదే విధంగా మక్కామసీదులోని మంచి నీటి కొలను శుభ్రం చేశారు. ఎండ తీవ్రంగా ఉన్నందున మక్కామసీదు ఆవరణలో ప్రత్యేకంగా టెంట్లుతో పాటు ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ నెలలో ముస్లింలు జానీమాజ్‌లను వినియోగిస్తారు. మదీనా సర్కిల్ మహ్మద్ క్యాప్ మార్ట్‌లో ఇటీ వల జానీమాజ్‌లను విక్రయించే మేళా ప్రారంభమైంది. రంజాన్ నెలలో ముస్లింలు ఎంతో ప్రీతితో హలీంను తింటారు. పాతబస్తీలో కోట్లాది రూపాయల హలీం అమ్మకాలు జరుగుతాయి. హలీం తయారు చేయటానికి పాతనగరంలోని పలు హోటళ్లు వద్ద హలీం కోసం బట్టీలు పొయ్యిలు ఏర్పాటు చేశారు. కాగా జిహెచ్ఎంసి ఆర్.వి.కర్ణన్ బుధవారం చారిత్రక మక్కామసీదునుసందర్శించారు. మక్కామసీదు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధింత అధికారులను ఆయన ఆదేశించారు. పాతనగరంలో అప్పుడే రంజాన్ మాసం వాతావరణం ప్రారంభమైంది. రంజాన్ మాసం సందర్భంగా పాతబస్తీలోని వ్యాపారులు రంజాన్ పండుగకు సంబందించిన వస్త్రాలు, కర్జూరం, ఇతర ఆహార వస్తువులు దేశంలోని పలు ప్రాంతాలు నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు చేశారు.

- ప్రారంభమైన పవిత్ర రంజాన్ మాసం
-చారిత్రక మక్కామసీదులో మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు


మక్కామసీదు మంచినీటి కొలనను శుభ్రం చేసినప్పటి చిత్రం

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావటంతో బుధవారం రాత్రి చారిత్రక మక్కామసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు

జిహెచ్ఎంసి సేవలకు "మై క్యూర్"

-సానిటేషన్ నుంచి టౌన్‌ప్లానింగ్ వరకు
-అన్ని సేవలు యాప్‌లో అందుబాటు
-పౌరుల ఫిర్యాదులకు ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫారం
-"రియల్‌టైమ్ "ట్రాకింగ్‌తో వేగవంతమైన పరిష్కారం

హైదరాబాద్, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:
సాంకేతికత దన్నుగా నగర పాలనను మరింత బలోపేతం చేస్తూ, పౌర కేంద్రిత సేవలకు ప్రాధాన్యం ఇస్తూ జీహెచ్ ఎంసీ "మైక్యూర్" యాప్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ తన ఎక్స్ ఖాతా ద్వారా తెలుపుతూ అప్లికేషన్ ప్రత్యేకతలను వెల్లడించింది. నగరంలోని పౌర సేవలను సులభతరం చేసి, ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే ఈ యాప్ లక్ష్యమని అధికా రులు తెలిపారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న "మైజీహెచ్ఎంసీ "యాప్‌కు బదులుగా రూపొందించిన "మైక్యూర్" యాప్ ద్వారా అన్ని పౌర ఫిర్యాదు సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చారు. వినియోగదారులకు అనుకూలంగా రూపొందించిన ఇంటర్‌ఫేస్, ఫిర్యాదులపై తక్షణ స్థితిగతుల సమాచారం, పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం వంటి సదుపాయాలతో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను నెలకొల్పడమే లక్ష్యమని వెల్లడించారు. సానిటేషన్, వీధి దీపాలు, రహదారులు, కాల్వలు, టౌన్‌ప్లానింగ్ తదితర అంశాలపై పౌరులు నేరుగా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చు. వాటి పరిష్కార స్థితిని యాప్ ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకునే వీలుంటుంది. ఫీల్డ్ స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధి కారుల వరకు సమన్వ యం సాధించేలా బ్యాక్‌ఎండ్ వ్యవస్థను అనుసంధానించామని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. కేంద్రీకృత డ్యాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షణ సులభమవడంతో పాటు పనితీరు అంచనా వేయడంలో కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. పౌర సేవలన్నింటినీ ఒకే డిజిటల్ వేదికపై సమీకరించే వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఈయాప్ పనిచేస్తుందని, కార్యాలయాలకు ప్రత్యక్షంగా వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అధికారులు వివరించారు. నగర ప్రజలు మైక్యూర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ సమస్యలను నమోదు చేసి వేగవంతమైన, పారదర్శక పరిష్కారానికి సహకరించాలని జీహెచ్ఎంసీ కోరింది. ఈ యాప్ ఆండ్రాయిడ్ (గూగుల్ ప్లే స్టోర్), ఆపిల్ ఐఓఎస్ (యాప్ స్టోర్) వేదికలపై అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

హైదరాబాద్, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:
మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. బుధవారం నాంపల్లిలో గల రెడ్ రోజ్ ప్యాలెస్‌లో తెలంగాణ రాష్ట్ర మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న పలు పథకాలను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సహాయ పథకాల ప్రారంభం, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, అలాగే శిక్షణ-ఉద్యోగ-ప్లేస్‌మెంట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనారిటీల సంక్షేమానికి రూ.3,500 కోట్ల బడ్జెట్ కేటాయించడం ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనమని తెలిపారు. మైనారిటీలలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా సబ్సిడీ ఆధారిత పథకాలు, స్వయం ఉపాధి ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి అలాగే ఉపాధి కల్పన కార్యక్రమాలను సమగ్రంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. యువత విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకొని స్థిరమైన జీవనోపాధిని సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మోపెడ్లు, ఈబైక్‌లకు మంత్రి హరిత జెండా ఊపి అందచేశారు. అదేవిధంగా ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కింద మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కోత్వాల్ మాట్లాడుతూ, వెనుకబడిన , బలహీన మైనారిటీ వర్గాల సామాజిక-ఆర్థిక అభివృద్ధిని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుందని పేర్కొన్నారు. సబ్సిడీ పథకాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీయుల్లా మాట్లాడుతూ, మైనారిటీల విద్యా , ఆర్థిక సాధికారత ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. ఫకీర్ అలాగే టుర్కా కాశా సమాజాలకు ప్రత్యేక పథకాలను అమలు చేస్తూ అత్యంత వెనుకబడిన వర్గాలకు మద్దతు అందిస్తున్నామని పేర్కొన్నారు. నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అనుసంధానం ద్వారా యువతకు స్థిరమైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మిర్జా రహ్మత్ బేగ్, రియాజుల్ హసన్, పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, మాజీ ఎమ్మెల్సీ ఆమీర్ అలీ ఖాన్, అఫ్జల్ బియాబాని ఖుస్రో పాషా, హజ్ కమిటీ చైర్మన్ అజ్మతుల్లా హుస్సైనీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, టీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రియాజ్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు, రాపిడో, ఉబెర్, టీవీఎస్ సంస్థల ప్రతినిధులు, అధికారులు , లబ్ధిదారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేస్తున్న మంత్రి అజారుద్దీన్

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు : మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:
జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక , రెండు పడకల గదుల ఇండ్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పారదర్శకతగా వ్యవహరిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందించటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎల్ వన్ కింద 4800 మంది అర్హులైన ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇల్లు నిర్మించుటకై నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకు పైగా దరఖాస్తులు వివిధ నియోజకవర్గాల నుండి పేద ప్రజలు అందజేశారని తెలిపారు. అందుకు నగరంలో స్థలాలు సేకరించి ఇందిరమ్మ ఇల్లు చేపట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఇల్లు పనులు పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు సూచించారు. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి. లబ్ధిదారులు ఎంత మంది తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలో లబ్ధిదారులకు అందించమని ఇంకా పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై శాసనసభ్యులతో కలిసి సమీక్షించారు. అలాగే నియోజకవర్గాల శాసనసభ్యుల అభిప్రాయాలను స్వీకరించి చేపట్టే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయి రాం హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోనిఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి పొన్నం ప్రభాకర్

మరో పెళ్లి చేసుకుందన్న కక్షతో భార్యను చంపిన మాజీ భర్త

సునీత (ఫైల్ ఫోటో)


మహేష్ నిందితుడు

వనస్థలిపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
విడాకులు తీసుకున్న మహిళ మరో వ్యక్తిని పెళ్లి చేసుకోవడంతో కక్ష పెంచుకున్న మొదటి భర్త ఆమెను కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాలు ప్రకారం.... పెద్దపల్లి మంతని కి చెందిన మహేష్ సాఫ్ట్వేర్ ఉద్యోగి. అతను మహారాష్ట్ర బల్లార్పూర్ కు చెందిన సునీత (29)లు ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో 2022 లో పెళ్లి చేసుకున్నారు. అనంతరం వారు కెనడాకు వెళ్లారు. రెండేళ్ల పాటు బాగానే ఉన్నా... తరువాత వారిరువూరి మధ్యలో మనస్పర్థలు వచ్చాయి. ఆమె కెనడా నుండి ఇండియాకు తిరిగివచ్చి మహేష్ మీద క్రిమినల్ కేసు పెట్టింది. అనంతరం వారు విడాకులు తీసుకున్నారు. 2025 లో ర్యావిరాలకు చెందిన శ్రీనివాస్ ను పెళ్లిచేసుకున్న సునీత గ్రీన్ సిటీ కాలనీ లో శ్రీనివాస్ తో కలసి ఉంటోంది. ఆమె 3 నెలల గర్భవతి. తల్లి చనిపోవడంతో మహేష్ కెనడా నుండి ఇండియా కు వచ్చాడు. సునీత తనను ఇబ్బంది పెట్టి సంతోషంగా ఉందని తెలుసుకున్న మహేష్ ఆమెపై కక్ష పెంచుకున్నాడు. 45 నెలలుగా ఎంక్వయిరీ చేసిన అతను సునీతను చంపి వేయాలని నిర్ణయించుకున్నాడు. తుర్క యంజాల్ లో బాయ్స్ హాస్టల్ లో ఉండి హత్యకు అవసరమయ్యే కత్తి, పెట్రోల్ సమకుర్చుకుని బుధవారం 12.30 గంటల సమయంలో సునీత ఇంటికి వెళ్ళాడు. ఆమె లోపల పనిచేసుకుంటూ ఉండగానే లోపలికి వెళ్లిన అతను తలుపు బోల్ట్ వేసాడు. అదును చూసి కత్తితో ఆమె ముఖం పై విచక్షణ రహితంగా దాడిచేసాడు. ఆమె అక్కడే మృతి చెందింది. అంతలో అక్కడకు చేరుకున్న సునీత అత్త అరవడంతో చూ టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి పెట్రోల్ పోసుకుని తాను చనిపోతానని బె దిరించాడు. పోలీసులు అతనికి నచ్చచెప్పి అదుపులోకి తీసుకున్నారు.

దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఎసిబి తనిఖీలు

-వివిధ విభాగాల్లో రికార్డుల పరిశీలన

దుండిగల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉదయాన్నే కార్యాలయంకు చేరుకున్న అనిశా అధికారులు డిప్యూటి కమీషనర్ వెంకటేశ్వర్‌నాయక్‌తో సహా ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకుని కార్యాలయం పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం ఆయా విభాగాలకు చెందిన రికార్డు లను క్షుణ్ణంగా పరిశీలించి అందుబాటులో ఉన్న ఉద్యోగులు, సిబ్బందిని విచారించారు. ఈసంద ర్భంగా ఏసిబి డిఎస్పి గంగసారి శ్రీధర్ మాట్లాడుతూ ...తమకు పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవిన్యూ, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో అవినీతి జరిగినట్లు గుర్తించామన్నారు. శానిటేష న్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి, రికార్డుల్లో చూపుతున్న సిబ్బందికి పొంతన లేదన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగం విషయానికి వస్తే మున్సిపాలిటి నుండి ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనం కావడం వలన రికార్డులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవన్నారు. అందుబాటులో ఉన్న రికా ర్డుల పరిశీలనలో పలు విషయాలను గుర్తించామని తెలిపారు. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలకు సంబంధించిన నోటీసులు జారీ చేసి మూడు నెలలు గడుస్తున్న ఎటువంటి చర్యలు తీసుకోలేద న్నారు. నోటీసులు జారీ చేసిన అక్రమ నిర్మాణాలలో కేవలం 10శాతం మాత్రమే చర్యలు చేప ట్టారు. వీటిపై సమగ్రంగా విచారణ జరిపి తదుపరి చర్యలు ఉంటాయాని, తనిఖీలు పూర్తి అయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. కాగా సర్కిల్ కార్యాలయంలో ఏసిబి తనిఖీలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పలు విభాగాలకు చెందిన అధికా రులు, సిబ్బంది సెల్‌ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకొని విధులకు గైర్హాజరయ్యారు. వారిని సైతం విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

దుండిగల్ సర్కిల్ కార్యాలయం

సాదాసీదాగా సాగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశం

కంటోన్మెంట్,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశం బుధవారం బోర్డు కార్యాలయంలో సాదా సీదాగా సాగింది. బోర్డు అధ్యక్షుడు, బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, నామినేటెడ్ బోర్డు మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్, సికఃఓ అరవింద్ కుమార్ ద్వివేదిలు పాల్గొని పలు ఎజెండాలపై చర్చించి ఆమోదం తెలిపారు. కొన్ని భవన నిర్మాణాలకు అనుమతిస్తూ నిబంధన లకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణా లపై తీసుకోవాల్సిన చర్యలపై బోర్డు సమావేశంలో చర్చించారు. బోర్డు మెంబర్ బానుక నర్మధ పదవి కాలం మరో సంవత్సరం పొడగించినందుకు ఎంపీ ఈటెల రాజేందర్‌కు శాలువకప్పి, పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.

కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో బ్రిగేడియర్ రాజీవ్,బోర్డు మెంబర్ బానుకనర్మధ సికఃఓ అరవింద్ కుమార్ తదితరులు

హలీం తయారీలో శుభ్రత పాటించాలి

- ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి
-హలీం భట్టి నిర్వహకులతో సమీక్ష

హైదరాబాద్ ఉప్పల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హలీమ్ తయారీదారులు విధిగా నిబంధనలు పాటించాలని మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ప్రముఖ హలీమ్ తయారీదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ హలీమ్ తయారీదారులు పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, సరైన మాంసం కొనుగోలు చేయాలని సూచించారు. మాంసం తగు ఉష్ణోగ్రతలతో ఉడికించాలని, నిర్వహణ, పర్యవేక్షణ ఉండాలని సూచించారు. సురక్షితమైన వాతావరణం ఉండాలని, నిల్వ చేసి వడ్డించకుండా చూడాలని కోరారు. వ్యర్థాలు రోడ్లపై పారవేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, హోటల్ పరిసరాల్లో వీధి కుక్కలు గుమికూడకుండా చూడాలని సూచించారు. పరిశుభ్రత పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే రంజాన్ పండుగ దృష్ట్యా హలీమ్ తయారీదారులు నిబంధనలు పాటిం చాలని కోరారు. హలీమ్ తయారీని మొదటి అంతస్థులో కాకుండా గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే ఉండాలని సూచించారు. హలీమ్ భట్టి ఉష్ణోగ్రత వలన ఎలాంటి ప్రమాదాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆమోదం పొందిన స్లాటర్ హౌస్‌ల నుండి మాత్రమే మాంసం కొనుగోలు చేయాలని ఆదేశించారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా దుకాణాల వద్ద ఒక వ్యక్తిని ఉంచాలని, ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశాన్ని ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (పారిశుధ్యం) సిఎన్ రఘుప్రసాద్, మల్కాజిగిరి, ఎల్‌బినగర్, ఉప్పల్ జోనల్ కమిషనర్లు సంచిత్ గంగ్వార్, హేమంత్ కేశవ్ పాటిల్, రాధికగుప్తా, పలువురు డిప్యూటి కమిషనర్లు, పుడ్‌సేఫ్టీ, వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ హలీం భట్టి నిర్వహకుల సమావేశంలో పాల్గొన్న ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, రాధిక గుప్తా తదితరులు

పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలి : కమిషనర్ ఆర్.వి.కర్ణన్

-చార్మినార్ ప్రాంతంలో క్షేత్రస్థాయి తనిఖీ

హైదరాబాద్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త: నగరంలో పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా, ప్రభావవంతంగా జరిగేలా జోనల్, డిప్యూటీకమిషనర్‌లు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశించారు. ఈమేరకు బుధవారం చార్మినార్ జోన్‌లో పారిశుధ్య కార్యక్రమాలను అదనపు కమిషనర్ (సానిటేషన్) రవి కిరణ్, చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి లతో కలిసి మక్కా మజీద్, మదీనా, చార్మినార్ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. పారిశుధ్య సిబ్బంది మోహరింపు, రూట్ మ్యాప్ , మానిటరింగ్ వ్యవస్థ, ప్రార్థన స్థలాల వద్ద పరిశుభ్రత చర్యలు, రోడ్ల క్లీనింగ్, వాణిజ్య, మార్కెట్ ప్రాంతాల్లో చెత్త సేకరణ, ప్రధాన కూడళ్లు, పాదచారుల మార్గాల పరిశుభ్రత వంటి అంశాలను కమిషనర్ సమీక్షించారు. డ్రైన్ల శుభ్రత, చెత్త పేరుకుపోకుండా తీసుకుంటున్న చర్యలు, సర్కిల్, జోనల్ స్థాయిలో పర్యవేక్షణ విధానాలపై అధికారులతో కమిషనర్ ఆర్ వి క్షేత్ర స్థాయిలో చర్చించారు. రంజాన్ మాసం ప్రారంభం కానున్న దృష్ట్యా పారిశుధ్య కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా అమలయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. రంజాన్ మాసం సందర్భంగా జన సంచారం పెరిగే అవకాశమున్నందున రహదారులు, కూడళ్లు, ప్రార్థనా స్థలాలు, సమావేశ ప్రదేశాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అదనపు సిబ్బంది మోహరింపు, కట్టుదిట్టమైన పర్యవేక్షణ, రియల్‌టైమ్ మానిటరింగ్ ద్వారా ప్రమాణాలకు అనుగుణంగా పారిశుధ్ధ కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పౌరులు, వ్యాపారులు పారిశుధ్ధ్య సిబ్బందికి సహకరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ విజ్ఞప్తి చేశారు. క్షేత్ర పర్యటనలో కమిషనర్ వెంట చార్మినార్ డిప్యూటీ కమిషనర్ సరిత, అధికారులు, తదితరులు ఉన్నారు.

చార్మినార్ ప్రాంతంలో పారిశుధ్ధ్య నిర్వాహణ తనిఖీ చేస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అడిషనల్ కమిషనర్ రవికిరణ్ తదితరులు

మహిళాశక్తికి ప్రతిరూపం రమాబాయి అంబేద్కర్ : ఎంపి విజయేంద్రప్రసాద్



ప్రముఖ మహిళలను మాతా రమాబాయి అంబేద్కర్ స్మారక పురస్కారాలతో సత్కరిస్తున్న విజయేంద్రప్రసాద్, జెబి.రాజు, బిఎన్.రత్న, శ్రీకళ, గణేష్ తదితర అతిథులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : మహిళలను ప్రోత్సహించి సదవకాశాలిస్తే రాణించలేని రంగమంటూ ఉండదని, అందుకు ప్రతిరూపమైన మహిళాశక్తికి తార్కాణం రమాబాయి అంబేద్కర్ అని రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ సినీరచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్ అన్నారు. మానవత్వం, మానవీయ విలువలకు, నిరంబదరతకు మారుపేరు రమాబాయి అని కొనియాడారు. అంబేద్కర్‌కు అన్నివేళలా తోడునీడగా వెన్నంటే ఉంటూ ఆయన విజయాలకు ఎంతగానో తోడ్పాటు అందించారని గుర్తుచేశారు. మాతా రమాబాయి అంబేద్కర్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మాతా రమాబాయి అంబేద్కర్ స్మారక పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు విజయేంద్ర ప్రసాద్, జె.బి.రాజు, ట్రస్టు ప్రతినిధులు బిఎన్.రత్న, కె.శ్రీకళ, కె.గణేష్ తదితరులు పాల్గొని జ్యోతిప్రకాసనంచేసి ప్రసంగించారు. అనంతరం ప్రముఖులు విమలా గద్దర్, బోయి విజయభారతి, అప్పికట్ల నళిని, గడ్డం సరోజ, ఆకాశపు అచ్చమాంబ, బొమ్మకు హిమమాల, గంగాధరి ప్రమీల, మల్లేపల్లి జయలను ఘనంగా సత్కరించి మాతా రమాబాయి అంబేద్కర్ స్మారక పురస్కారాలను ప్రదానం చేసి శుభాభినందనలు తెలిపారు.

ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే కాలేరు

బాధిత కుటుంబీకులకు ఎల్ఓసీ అందచేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త: అంబర్‌పేట్ ప్రజల ఆరోగ్యం, సంక్షేమంకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్పష్టం చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గోల్నాక డివిజన్‌కు చెందిన ఎం.రాములమ్మ కుటుంబ సభ్యులకు వైద్య సహాయార్థం 1,20,000 రూపాయలకు ఎల్ఓసీ పత్రాలను అందచేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులు తమకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియచేశారు.

శ్రీ సాయి అలేఖ్య 30 వసంతాల వార్షికోత్సవ వేడుకలు...

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త

కూకట్‌పల్లిలోని శ్రీ సాయి అలేఖ్య 30 వసంతాల వార్షికోత్సవం రైతుకు వందనం జై కిసాన్ కార్యక్రమం 9,000 మందితో ఎల్బీ స్టేడియంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు రైతుకు వందనం బృంద నృత్యం ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు కోసం ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ టిపిసి వైస్ ప్రెసిడెంట్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ బ్రోచర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండి రమేష్ విచ్చేయనున్నారు. నేను సైతం రైతుకు వందనం అనే కార్యక్రమానికి మీరందరూ కూడా మేము సైతం అంటూ రైతులను ప్రోత్సహిద్దాం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం ఈ కార్యక్రమంలో సాయి అలేఖ్య వ్యవస్థాపకులు అరుణ అశోక్, సాయి అలేఖ్య మెంబర్స్, సాయి తులసి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును అభినందించిన కెసిఆర్

శంభీపూర్ రాజును సన్మానిస్తున్న కేసీఆర్

దుండిగల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త

గడ్డపోతారం మున్సిపాలిటీకి బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అకుంఠిత దీక్షతో, అలుపెరుగని పోరాటంతో పార్టీకి అఖండ మెజారిటీ సాధించడంలో విశేష కృషి చేశారు. ఆయన వ్యూహాత్మక నాయకత్వం ఫలితంగా మున్సిపాలిటీ చైర్మన్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసంలో కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజును తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ఘనంగా సన్మానించి, అభినందించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేసీఆర్ దీర్ఘాయుష్షుతో, ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం రాజన్న సేవలను అభినందిస్తూ కేసీఆర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సివిల్ సప్లై మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, టీఎస్ఐఐసీ మాజీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

స్కూల్ సైన్స్ ఫెయిర్ కార్యక్రమం

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త

సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి హాజరైన మన్నే రాజు, గుబ్బల లక్ష్మీనారాయణ

జైశ్రీరామ్ నగర్ అర్జున్ స్కూల్‌లో బుధవారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే రాజు, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ అనేది విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకతను, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించే ఒక అద్భుతమైన ప్రదర్శన అని అన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు, నమూనాలు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, శకుంతల, వేణు ముదిరాజ్, చందు, అనిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోర్డు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తా : ఎంపీ ఈటెల

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటెల రాజేందర్ తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డుకు తక్షణమే ఎన్నికలు నిర్వహించి ప్రజల చేత ఎన్నుకోబడిన పాలక మండలి ఏర్పాటు కోసం తక్షణమే బోర్డు ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు.బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 56 కంటోన్మెంట్ బోర్డులలో స్థానికులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వంపై అనేక సార్లు ఒత్తిడి తెచ్చినట్లు ఆయన తెలిపారు. బోర్డు ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వారి సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు ఉండాలన్నారు. బోర్డు మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ మాట్లాడుతూ ఎంపీ ఈటెల రాజేందర్ సహాయ సహకారాలతో బోర్డు మెంబర్‌గా సంవత్సరం పూర్తి చేసుకొని తిరిగి 2వ సారి అవకాశం కల్పించినందుకు ఈటెలకు అభినందనలు తెలియజేశారు. కంటోన్మెంట్‌లోని 8 వార్డు ప్రాంతాల అబివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహంకాలి జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఎన్.శ్రీనివాస్, బిజెపి నాయకులు డాక్టర్ వంషా తిలక్, బానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్ రెడ్డి,మాజీ కార్పోరేటర్ కొంతం దీపికలతో పాటు వందలాది మంది బిజెపి నాయకులు పాల్గొని ఎంపీ ఈటెల,బోర్డు మెంబర్ నర్మధలకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిట్ల నాగేశ్, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు అన్ని సౌకర్యాలతో మసీదులు, ఈద్గాలు తీర్చిదిద్దండి : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

సమావేశంలో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ శాసనసభులు కె.పి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

రంజాన్ పర్వదినం శాంతి,సహనం, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో మైనార్టీలతో కలిసి నియోజకవర్గ పరిధిలోని అన్ని సర్కిళ్ల మున్సిపల్ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల వద్దపారిశుద్ధ్య నిర్వాహణ, తాగునీటి సదుపాయం, వీధిదీపాల ఏర్పాటు, రహదార్ల నిర్వాహణ, చెత్త తరలింపు, వీధికుక్కల బెడద నివారణ వంటి అనేక అంశాలలో ప్రత్యేక జాగ్రత్తచర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో చింతల్ డిప్యుటీ కమిషనర్ లావణ్య, జీడిమెట్ల సర్కిల్ డిప్యుటీ కమిషనర్ డి.శంకర్‌రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ డిప్యుటీ కమిషనర్ సాబేర్‌అలీ, గాజులరామారం డిప్యుటీ కమిషనరు శ్రీపాద రావు, కొంపల్లి డిప్యుటీ కమిషనర్ కృష్ణారెడ్డి, కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారి అశోక్‌కుమార్, రాజేశ్వర్‌రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, మెట్రోవాటర్‌వర్క్స్ డిజిఎం రవినాయక్, విక్, విద్యుత్‌శాఖ ఎడిఇ శ్రీకాంత్ తోపాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆయా మజీదులు, ఈద్గాల వద్ద నెలకొన్న సమస్యలఎపై మైనార్టీ నాయకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంఎల్ఎ వివేకానంద్‌కు లిఖితపూర్వక వినతిపత్రాలను సమర్పించారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం : సిపిఐ

అత్తాపూర్ ఫిబ్రవరి18,ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కరం కోసం సిపిఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తూ పేద ప్రజల పక్షాన నిలబడుతుందని పలువురు సిపిఐ నాయకులు పేర్కొన్నారు.బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ రాజేంద్రనగర్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన మండల సిపిఐ కౌన్సిల్ హాల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు ముఖ్యనేతలు మాట్లాడుతూ.... కొత్తగూడంలో కార్పొరేషన్‌ను సిపిఐ పార్టీ మేయర్ పదవి దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో సిపిఐ పార్టీ బలంగా తయారవుతుందని రాబోయే రోజులో ప్రజా సమస్యలను కోసం పోరాటం చేస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదిస్తామని అన్నారు.తోక పార్టీ అనే బిజెపి వాళ్లకు ప్రజాలే బుద్ధి చెబుతారని అన్నారు. రాజేంద్రనగర్ మండలంలో పేదల కోసం వారి సమస్యల పరిష్కరానికి పోరాటం సాగిస్తుందని నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి సర్కిళ్లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో వీలనం చేయడానికి నిరసిస్తూ అన్ని పార్టీలని కలుపుకొని రాబోయే రోజుల్లో ఉద్యమం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జల్లయ్య ,రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు , ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు , సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి , జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఏ రియాజ్ ,జిల్లా సమితి సభ్యులు జే ఆనంద్ గౌడ్ ,కన్యగారి లక్ష్మి ,మండల సహాయ కార్యదర్శి జె విజయ ,ఆనంద్ గౌడ్ , మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం, మండల ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు ఎండి సలీం ,సయ్యద్ ఖాజా , మండల కౌన్సిల్ సభ్యులు సదానంద గౌడ్ ,మునేశ్వరి, వాణి ,మౌనిక ,రామచందర్ ,గంగారాం ,సాబీర్ ,తదితరులు, పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్‌కు ప్రజల సన్మానం

గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ను బుధవారం సత్కరిస్తున్న ఎస్ ఆర్ టి కాలనీ వాసులు

చిక్కడపల్లి ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త) : అలుపెరుగని కృషితో గాంధీనగర్ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించిన తాజా మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ ను స్థానిక ఎస్ ఆర్ టి కాలనీ వాసులు బుధవారం ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్ల పదవీ కాలంలో అసాధ్యమనుకున్న పనులను సుసాధ్యం చేస్తూ, ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన ఆమె సేవలను గుర్తించి ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు కార్పొరేటర్ చేసిన అభివృద్ధి పనులను కొనియాడారు. ప్రపంచాన్ని వణికించిన కోవిడ్ సమయంలో 100 పడకల ఉచిత ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేసి, వ్యాధిగ్రస్తులకు వ్యాక్సిన్, అన్ని వసతులు కల్పించి పావని వినయ్ కుమార్ ధైర్యం నింపారన్నారు.పావని వినయ్ కుమార్ మాట్లాడుతూ "ప్రజలు నాపై ఉంచిన నమ్మకమే నన్ను ఈరోజు ఈ స్థాయిలో నిలబెట్టిందని అన్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మంజూరు చేసిన నిధులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ సహకారం, జి హెచ్ ఎం సి నిధులతో డివిజన్‌ను అభివృద్ధి చేయగలిగాను అని అన్నారు. కార్యక్రమంలో సన్మాన నిర్వాహకులు జి. శ్రీనివాస్ యాదవ్, కడియం రాము, సంజీవ, శివ కుమార్, ప్రశాంత్, భారత్, జ్ఞానేశ్వర్, యాదగిరి , ఎస్ఆర్‌టి కాలనీ వాసులతో పాటు బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, సీనియర్ నేతలు రత్న సాయి చంద్, శ్రీకాంత్, దామోదర్, పాల శ్రీనివాస్, ఎం. ఉమేష్, మహమూద్, ఆనంద్ రావు, హనుమత్, కుమార్, నీరజ్, అరుణ్ కుమార్, సాయి సంతోష్, రాజ్ కుమార్, రహమత్ అలి, శేషికాంత్, లావణ్య, లక్ష్మి, సంధ్యా రాణి, సంయుక్త రాణి, పూర్ణ, అనుష తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖలో పునర్వ్యవస్థీకరణ...డిప్యుటేషన్‌పై పెద్ద ఎత్తున బదిలీలు

- జిల్లా కలెక్టర్ హరిచందన నిర్ణయం

దారులేషిపాలోని బహదూర్‌పురా జోన్ కార్యాలయం...బదిలీయైన బహదూర్‌పురా, చార్మినార్ జోన్ల డిప్యూటీ ఈవోలు పొమ్మా నాయక్, సుజాతలు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త : హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ పరిధిలోని పలు జోన్లు, మండలాలలో విధుల నిర్వాహణలో, పాఠశాల అనుమతులు, అమోదాలు, సిబ్బంది సమస్యలు, నిరభ్యంతర ధృవీకరణ పత్రాల (ఎన్ఓసీ) జారీ, తాత్కాలిక గుర్తింపు పొడగింపు (ఇటిఆర్) మంజూరు, పదవీ విరమణ ప్రతిపాదనల ప్రాసెసింగ్ తదితర విషయాలలో అవకతవకలకు పాల్పడటం, ఫిర్యాదులు, ప్రతికూల నివేదికలు, మీడియా కథనాలు, బండ్లగూడ జోన్ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి చిక్కటం తదితర పరిణామాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలోని 12 జోన్ల డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్(ఈవో)లను, 24 మంది డిప్యూటీ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ స్కూల్స్ (ఐవోఎస్)లను, జూనియర్ అసిస్టెంట్లను, రికార్డు అసిస్టెంట్లపై సామూహిక వేటు వేశారు. డిప్యుటేషన్ విధానంలో అందరికి స్థాన చలనం చేశారు. జిల్లాలో విద్యాశాఖ స్వేచ్ఛగా, న్యాయంగా, పారదర్శకంగా పనిచేసేలా కొన్ని పరిపాలనా పరమైన మార్పులు చేశారు. బదిలీలు తక్షణమే అమలులోకి వస్తాయని, సంబంధిత డిప్యూటీ ఈవోలు, ఐఓఎస్‌లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు తమ తమ స్థానంలో వెంటనే చేరిపోవాలని, లేని పక్షంలో సీసీఎ నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. డిప్యుటేషన్‌పై బదిలీలు ఇలా ఉన్నాయి.... బహదూర్‌పురా డిప్యూటీ ఈవో కె.పోమ్మా నాయక్‌ను సైదాబాద్‌కు, బండ్లగూడ డిప్యూటీ ఈవో పి.వీరలక్ష్మిని నాంపల్లికి, చార్మినార్ డిప్యూటీ ఈవో జి.సుజాతను ముషీరాబాద్‌కు బదిలీ చేశారు. వారి స్థానంలో బహదూర్‌పురా డిప్యూటీ ఈవోగా సైదాబాద్ ఈవో డి.సుకన్యను, బండ్లగూడ ఈవోగా నాంపల్లి ఈవో బి.వెంకటేశ్వర్లును, చార్మినార్ ఈవోగా ముషీరాబాద్ ఈవో కె.శ్రవణ్ కుమారను నియమించారు. ఇక బహదూర్‌పురా డిప్యూటీ ఐఎఎస్‌లుగా పి.వెంకట్‌రెడ్డి, ఎస్.నరేందర్ యాదవ్, బండ్లగూడ డిప్యూటీ ఐఎఎస్‌లుగా జి.విశ్వనాథం గుప్తా, కె.బి.జయలక్ష్మి, చార్మినార్ డిప్యూటీ ఐఎఎస్‌లుగా జి.మీనా కుమారి, కె.మదన్‌మోహన్‌లను నియమించారు. అదేవిధంగా జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లను సైతం మార్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలోని అన్ని జోన్లలో కింది స్థాయి నుండి పైస్థాయి వరకు ఉద్యోగులను బదిలీ చేయటం చర్చనీయాంశమైయ్యింది. కాగా బండ్లగూడ ఈవోగా పనిచేసిన శాంతాబాయి రాథోడ్ పలు కారణాలతో ఎఫ్ఎసిగా ఇటీవల తప్పుకున్నారు. ఆమె స్థానంలో తిరుమలగిరి మండలంలోని పికెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్ఎం) పి.వీరలక్ష్మిని నియమిస్తూ ఈనెల 16న హైదరాబాద్ ఆర్‌జెడి ఎం.సోమిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అదే రోజు ఆమెను తిరిగి నాంపల్లి జోన్‌కు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయటం గమనార్హం.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో యువజనోత్సవాలు

అత్తాపూర్ ఫిబ్రవరి18,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల, ఆధ్వర్యంలో గురువారం(నేటి) నుండి 21 వరకు మూడు రోజుల పాటు యూత్ ఫెస్టివల్ - యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో సాంస్కృతిక, సృజనాత్మక మరియు విద్యా పరమైన పలు పోటీలు నిర్వహించబడతాయని ముఖ్యంగా కల్చరల్ ప్రోగ్రామ్స్, క్రియేటివ్ ఆర్ట్స్, ఎగ్జిబిషన్, అగ్రిబిజినెస్ ఐడియాస్, అగ్రిటెక్ కాంపిటెన్స్ ఛాలెంజ్, గ్రీన్ టెక్ విజిట్స్, స్పెల్ బీ పోటీలు, కేస్ స్టడీ ప్రెజెంటేషన్స్ వంటి విభిన్న కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి.రాష్ట్ర పరిధిలోని 13 వ్యవసాయ కళాశాలలు మరియు అనుబంధ కళాశాలల నుండి సుమారు 280 మంది విద్యార్థులు ఈ యువజనోత్సవాలలో పాల్గొననున్నారు. మొత్తం 13 విభాగాలలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.

జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించండి

- జిహెచ్ఎంసి కమిషనర్‌కు మన్నె గోవర్ధన్‌రెడ్డి వినతి

కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త: జీహెచ్ఎంసీ సర్కిళ్ల విభజన అనంతరం సైతం జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయంలో ఖైరతాబాద్ కార్యాలయంలోనే కొనసాగుతుందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంపై దృష్టి సారించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు బుధవారం ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి వినతిపత్రం అందించారు. ప్రజలకు మరింత అందుబాటులో, మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జీహెచ్ఎంసీ సర్కిళ్లను విభజించిందని, అయితే జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట సర్కిళ్లను ఏర్పాటుచేసినటప్పటికి ఇంతవరకు కార్యాలయాలను కేటాయించలేదన్నారు. దీంతో ప్రజలు గతంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులనే ఇప్పటికి ఎదుర్కొంటున్నారన్నారు. సర్కిళ్ల విభజనను కాగితాల మీద చేసినప్పటికి కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రదానంగా జూబ్లీహిల్స్ సర్కిల్‌లోని ప్రజలు ఏదైనా ఫిర్యాదు చేయాలన్నా, అధికారులను కలవలన్నా ఖైరతాబాద్ కార్యాలయానికి తరలివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో ముఖ్యమంత్రి నివాసంతోపాటు మంత్రుల క్వార్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులు ఉన్నప్పటికి సర్కిల్ కార్యాలయం ఏర్పాటుచేయకపోవడం శోచనీయం అన్నారు. అలాగే బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఫిల్మ్‌నగర్ డివిజన్ ప్రజలు సైతం ఖైరతాబాద్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యలపై తక్షణమే స్పందించి కార్యాలయాలను ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని ప్రజలకు ఇబ్బందులను దూరం చేయాలని కమిషనర్‌ను కోరినట్లు మన్నె గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో బీఆర్ఎస్ నేతలు రాంచందర్, నరసింహ, శంకర్, విశాంత్, శశిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీకృషికి మారుపేరు వేమరాజు నరసింహారావు : డా. కె.వి.రమణాచారి

నవ్యనాటకసమితి అమృతోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి, ఫణీంద్ర, విజయకుమార్, కుసుమకుమారి, మురళీధర్ తదితర అతిథులు

నాంపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : ఒక ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్నత్యోగి స్థాయిలో పనిచేస్తూవుంటూ సాంస్కృతిక రంగంలో తనదైన అద్భుతశైలిలో అశేషకృషిచేసిన వేమరాజు నరసింహారావు చిరస్మరణీయుడు, కారణజన్ముడని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. భౌతికంగా ఆయన లేకపోయినా తెలుగుభాషా సాహిత్యాల అభివృద్ధి, సేవల కోసం స్థాపించిన నవ్యనాటకసమితి సంస్థ ద్వారా ఆశయాలను, లక్ష్యాన్ని ముందుకుతీసుకువెళుతున్న 75వ వసంతవేళ అమృతోత్సవం నిర్వహిస్తోన్న వేమరాజు విజయకుమార్, కుటుంబసభ్యులను ఎంతగానో అభినందించారు. ఈ అమృతోత్సవ వసంతంలో ప్రతీనెలా నిర్వహించనున్న కార్యక్రమాల కార్యాచరణను రూపొందించి మొదటినెల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో 24న రాత్రి 6గంటలకు సుప్రసిద్ధ ఆధ్యాత్మిక శాస్త్ర, సాహితీవేత్త వల్లూరి శ్రీరామచంద్రమూర్తిచే మహాకవి విశ్వనాథ వారి శ్రీమద్రామాయణ కల్పవృక్షంపై ప్రధాన ప్రసంగాన్ని ఏర్పాటుచేయడం ముదావహం అన్నారు. ఈమేరకు రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమణాచారి విశిష్ట అతిథులు వి.విజయకుమార్, ఆచార్య ఫణీంద్ర, డా. యు.కుసుమకుమారి, డా. నండూరి విద్యారణ్యస్వామి, సింగరాజు లక్ష్మి, వై.చలపతిశాస్త్రి, టి.మురళీధర్ గౌడ్ బాలాజీశర్మ తదితరులతో కలిసి అమృతోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంస్థ ఉపాధ్యక్షురాలు కుసుమకుమారి, అధ్యక్షుడు ఫణీంద్ర సంస్థ అమృతోత్సవాన్ని ఎలా నిర్వహించనున్నారో సవివరపరిచారు.

తప్పనిసరిగా వ్యాపార అనుమతి పొందాలి : డిప్యూటీ కమిషనర్

షాపు యజమానితో మ

ఆటో డ్రైవర్‌ను మేయర్‌గా ఎంపికి చేసిన కూనంనేనికి సత్కారం

కూనంనేని సాంబశివరావును సత్కరిస్తున్న బి.వెంకటేశం

సైఫాబాద్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: పేద, గిరిజన ఆటో డ్రైవర్, తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకుడు మూడ్ గణేష్‌ను కొత్త గూడెం మున్సిపల్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఎంపిక చేయడం అభినందనీయమని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం కొనియాడారు. గణేష్‌ను కొత్తగూడెం మేయర్‌గా ఎంపిక చేసినందుకు బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం, మఖ్దూం భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును వెంకటేశం, యూనియన్ నాయకులు కలిసి శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆటో యూనియన్ నేతగా, కార్మికుల హక్కులు, ఇతర సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీలో కీలక నేతగా ఎదిగిన గణేష్ ఆటో డ్రైవర్ స్థాయి నుంచి ఏకంగా మేయర్‌గా ఎన్నికై ఎంతో మంది ఆటో డ్రైవర్లకు, కార్మికులకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. బి.వెంకటేశం మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన గణేష్ ఆటో డ్రైవర్‌గా, సిపిఐ నాయకుడిగా పనిచేస్తూ మేయర్ స్థాయి వరకు ఎదగడం ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.అశోక్, సి.హెచ. జంగయ్య, ఎం.శ్రీనివాస్, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేశవగిరి పురవీధుల్లో వైభవంగా ఆదిదంపతుల రథోత్సవం

కేశవగిరి పురవీధుల్లో శివపార్వతులను ఊరేగిస్తున్న ఆలయ ప్రతినిధులు, భక్తులు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట కేశవగిరిపై గల పురాతన శివాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. శివకేశవ భక్త సమాజం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలలో చివరి రోజున బాణా సంచా మోతలు, దప్పు వాయిద్యాలు, మహిళల మంగళ హారతుల మధ్య సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన రథంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి పురవీధుల్లో ఊరేగించారు. తగిన పోలీసు బందోబస్తు మధ్య ఆలయం నుండి ప్రారంభమైన ఊరేగింపు కేశవగిరి, చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్, గాంధీ విగ్రహం, చాంద్రాయణగుట్ట చౌరస్తా, కుమ్మరివాడి, దేవి దేవాలయం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. దారి పొడవున మహిళలు ఆది దంపతులకు కొబ్బరి కాయాలు సమర్పించి హారతులు పట్టారు. ఆలయ అర్చకులు జంగం గురుమూర్తి, జి.సత్యనారాయణ, కె.నాగరాజు, పాల్వాయి సాయికిరణ్, ఆర్.రాజు ముదిరాజ్, సుధాకర్, రామకృష్ణ, మల్లేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో డప్పు కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే నవీన్ యాదవ్

యూసుఫ్‌గూడ మహ్మూద్ ఫంక్షన్ హాల్‌లో కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలలో ఆడ బిడ్డల పెళ్లిళ్లు ఆర్థిక భారం కాకుండా చూడాలనే గొప్ప ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబార్ పథకాలు అమలు చేస్తోందని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్ అన్నారు. బుధవారం యూసుఫ్‌గూడ మహ్మూద్ ఫంక్షన్ హాల్‌లో ఎర్రగడ్డ, వెంగళ్‌రావునగర్ డివిజన్లకు సంబంధించిన 45 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త : రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని సలీమ్ బాబా నగర్ బస్తీలో కొందరు రాత్రికి రాత్రే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టారు. ఖైరతాబాద్ రెవెన్యూ మండల పరిధిలోకి వచ్చే స్థలంలో గతంలో 2018లో ఇదే మాదిరిగా నిర్మాణం చేపడుతుంటే మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే తాజాగా కొందరు ఆబోర్డును తొలగించి అక్రమ నిర్మాణం చేపట్టారు. ఈ విషయమై స్థానికులు మండల అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఏమాత్రం స్పందించటం లేదని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ నిర్మాణాలను తొలగించాలని కోరారు.

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

-బోర్డు పాలకమండలి సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన ఎమ్మెల్యే

మీడియాతో మాట్లాడుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు ప్రాంత ప్రజల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తూనప్రజా స్వామ్యాన్ని కూనీ చేస్తుందని, బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ మెంబర్ వ్యవస్థతో 6 యేండ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ఆరోపించారు. బుధవారం బోర్డు కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు సివిల్ ఏరియా ప్రాంతాలను వెంటనే గ్రేటర్‌లో విలీనం చేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలన్నారు. కంటోన్మెంట్‌ను గ్రేటర్‌లో విలీనం చేయాలన్న నినాదంతో కంటోన్మెంట్ ప్రజల అభివృద్ధి కోసం ఇటీవల 8 రోజులు రిలీ నిరాహార దీక్ష చేశామన్నారు. తమ దీక్షకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున సంఘీ భావం తెలిపారన్నారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డులో నిర్వహించిన పాలక మండలి సమావేశాన్ని బహిష్కరించి తమ అభిప్రాయాన్ని బ్రిగేడియర్ రాజీవ్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. బోర్డు ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వ జిహెచ్‌ఎంసీలో విలీనం చేస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు.

ఛత్రినాక కూడలిలో ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి

ఛత్రినాక కూడలిలో శివాజీ మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త : భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతిని బుధవారం ఛత్రినాక కూడలిలో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, గౌలిపురా డివిజన్ కార్యదర్శి జి.చంద్రమోహన్ గౌడ్‌లు ఆపార్టీ నేతలతో కలిసి శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ మనువాద శక్తులు ఛత్రపతి శివాజీ మహారాజును హిందూ సామ్రాట్‌గా అభివర్ణిస్తూ, ముస్లింలకు వ్యతిరేకంగా నిలబడ్డాడని కొన్నేళ్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నాలుగు భాషలలో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. సిపిఐ గౌలిపుర డివిజన్ కార్యదర్శి జి. చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ అనేక యుద్ధాలు చేసి రాజ్యాలను హస్తగతం చేసుకున్నారన్నారు. తన సైన్యంలో అనేకమంది రైతులను చేర్చుకోవడం జరిగిందనీ, శ్రమను నమ్ముకుని జీవిస్తున్న ప్రజలకు కత్తి సాము నేర్పించాడన్నారు. చివరికి కాశీ నుండి వచ్చిన పురోహితుడు కాలు బొటనవేలుతో తిలకం దిద్ది శివాజీని అవమానం పరిచినట్లు పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ అనేక సంవత్సరాలుగా సభలు సమావేశాల ద్వారా సమాజాన్ని చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. త్రినాక చౌరస్తాలో దుకాణాలు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్, కౌన్సిల్ సభ్యులు కళ్యాణ్, అరుణ్, నాగరాజు, సాయి, కాశీనాథ్, మహేందర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు వెంటనే అమలు చేయాలని బిజెపి ఆందోళన

ఆందోళనలో పాల్గొన్న ఫిల్మ్‌నగర్ బీజేపీ నేతలు.

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఫిల్మ్‌నగర్ బీజేపీ నేతలు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ముద్దంగుల శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకులు బోయ రామాంజనేయులు, డివిజన్ ప్రధాన కార్యదర్శి చెలిమిటి గిరి, యువమోర్చా అధ్యక్షులు మంజలి నరసింహ, యువమోర్చా ప్రధాన కార్యదర్శి హరీష్ ముదిరాజు, నాయకులు బాలరాజు, కట్టా శంకర్, అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఫించన్లు సరిగా రాక లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని నేతలు ఆరోపించారు. ఈ మేరకు వారు ప్లెక్సీలు పట్టుకొని తమ ఆందోళనను వ్యక్తం చేశారు.

గిరిజన భాషా సంస్కృతులను పరిరక్షించవలసిన అవసరం ఉంది

సమావేశంలో ప్రసంగిస్తున్న వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సూర్యా ధనంజయ్

చార్మినార్,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : భారత దేశంలో అత్యంత ప్రాచీనమైన గిరిజన భాషా సంస్కృతులను పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సూర్యా ధనంజయ్ అన్నారు.ప్రభుత్వ సిటీ కళాశాలలో బుధవారం జరిగిన సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య సూర్యా ధనంజయ్ మాట్లాడుతూ బంజారాల ఆచార వ్యవహారాలు అత్యంత విలక్షణమైందని అన్నారు.బంజారా విద్యార్థులు ఉన్నత విద్యావంతులై దేశ పునర్నిర్మాణానికి పాటు పడాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భోజ మహరాజ్,ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ ప్రసాద్,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.విప్లవ్ దత్ శుక్లా,డాక్టర్ సుజాత అజ్మీర్,డాక్టర్ శాంతి,డాక్టర్.శంకర్ కుమార్,డాక్టర్ తిరుపతి,కెపి నాయక్,కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

మహేంద్రహిల్స్ గురుకుల విద్యార్థినికి హిందీ ప్రతిభా పురస్కారం : ప్రిన్సిపాల్ సునీత

మహేంద్రహిల్స్ గురుకుల విద్యార్థినీకి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న గవర్నర్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినీ బి.సురేఖకు హిందీ ప్రతిభా రత్న పురస్కారాన్ని అందుకున్నట్లు ప్రిన్సిపాల్ శీలం సునీత తెలిపారు. హిందీ ప్రతిభపరీక్షలో సురేఖ ప్రతిభ కనబర్చినందుకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా రూ.1550 నగదుతో పాటు ప్రశంసపత్రం, మెడల్స్, మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా మహేంద్రహిల్స్‌లోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, టీచర్లు,వారి తల్లిదండ్రులు అభినందించారు.

ఆటో డ్రైవర్‌కు మూడు రోజుల జైలు శిక్ష

బేగంపేట ఫిభ్రవరి 18,ప్రభాతవార్త

కళాశాల విద్యార్థులు పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు తెలియజేసారు.ఛార్మినార్ కు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అఖిల్ (56)కు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.తమను ఎవరు చూడటం లేదు అనే భ్రమలో ఉండే ఇలాంటి వారిపైన పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ టీవీలు,షీ టీం బృందాలు నిత్యం పహారా చేస్తూనే ఉంటాయని, బహిరంగ ప్రదేశాల్లో తప్పుడు పనులు చేస్తే ,భవిష్యత్‌లో శిక్షలు తప్పవని బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు తెలియజేసారు. మహిళలు,యువతులు ఆటోలలో ప్రయాణించే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు.అత్యవసర పరిస్థితులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

భర్తను హత్య చేసిన భార్య

యాకుత్‌పుర,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : భర్త పెట్టే వేధింపులు భరించలేక ఓ భార్య కట్టుకున్న భర్తను నుస్నీతోగొంతు బిగించి హత్య చేసిన సంఘటన పాతబస్తీ భవానీనగర్ పోలీ స్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీ సుల కథనం ప్రకారం..... భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నషేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన ఇషాక్ (35)కు పదిహేను సంవత్సరాలు క్రితం నూర్జహాన్ బేగంతో వివాహం జరిగింది.వీరికి ముగ్గురు పిల్లలు కలరు.ఇషాక్ ఆటో నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా భర్త ఇషాక్ మద్యానికి బానిస కావటంతో పాటు తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు.ఆర్థిక ఇబ్బందులు,భర్త ఇషాక్ తాగి ఇంటికి వస్తుండటంతో భార్యాభర్తలతో మధ్య తరుచుగా గొడవలు జరుగుతుం దేవి.కాగా మంగళవారం రాత్రి భర్త ఇషాక్ తాగి ఇంటికి వచ్చాడు.తాగిన మైకంలో ఇషాక్ భార్య నూర్జహాన్ తో గొడవ పడి కొట్టాడు. క్షణికావేశంలో భార్య నూర్జహాన్ నుస్నీతో భర్త ఇషాక్ మెడను బిగించింది.ఊపిరి ఆడకపోవటంతో భర్త ఇషాక్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వామి రామానందతీర్థ మెమోరియల్‌కు సహాయ సహకారాలు అందిస్తా : ఎమ్మెల్యే తలసాని

బేగంపేట ఫిభ్రవరి 18,ప్రభాతవార్త

స్వామి రామానందతీర్థలో సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న తలసాని,వాణీదేవి.

పేద విద్యార్థులకు సేవలు అందిస్తున్న స్వామి రామానందతీర్థ మెమోరియల్‌కు సహాయ సహకారాలు అందిస్తానని,తలసాని ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.బేగంపేట బ్రాహ్మణవాడీలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి ఏటా తలసాని ట్రస్ట్ ద్వారా అందజేస్తామని ఎమ్మెల్యే అన్నారు.బుధవారం స్వామి రామానందతీర్థ లో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ను ఎమ్మెల్యే తలసాని, ఎమ్మెల్సీ వాణీదేవి,తాజా మాజీ కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరిలతో కల్సి ప్రారంభించారు.ముందుగా ప్రాంగణంలోని మాజీ ప్రధాని పీ.వీ.నరసింహారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ స్వామి రామానంద తీర్థ శిష్యులు పీ.వీ.ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ట్రస్ట్ ద్వారా అనేకమంది పేద విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ అనేక మందిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారని ప్రశంసించారు.పీ.వీ.మరణానంతరం ఆయన కుమార్తె సురభి వాణీదేవి తండ్రి ఆశయాలు,లక్ష్య సాధన కోసం కృషి చేస్తున్నారని అన్నారు.ప్రస్తుతం నర్సరీ నుంచి 7వ తరగతి వరకు ఉన్న మెమోరియల్ ను 10వ తరగతి వరకు అప్ గ్రేడ్ కు కృషి చేస్తానని,అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసికెళ్తానని చెప్పారు.వచ్చే విధ్యా సంవత్సరం నుంచి విధ్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు అవసరమైన క్రీడాసామాగ్రి, ఫర్నీచర్ ను కూడా తలసాని ట్రస్ట్ ద్వారా అందజేస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ ,ఎమ్మెల్సీ సురభి వాణీదేవి,ప్రిన్సిపాల్ వాసుకి,మేనేజర్ అరుణశ్రీ,తాజా మాజీ కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి,నాయకులు శ్రీహరి, నరేందర్,శ్రీనివాస్‌గౌడ్,శేఖర్, ఆరీఫ్,మోహిన్, శ్యామ్,భరత్, నాని,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆమెకు 33.. అతనికి 23

- జూబ్లీహిల్స్ గొలుసు చోరీలో పోలీసులకు చిక్కిన జంట!

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి సమీపంలో జరిగిన గొలుసు చోరీ సంఘటనలో నిందితులను 24 గంటలు తిరక్క ముందే పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.. వివరాల్లోకి వెళితే.. మాదాపూర్‌లోని హాస్టల్‌లో నివసించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని కడవల మానస(27) మంగళవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 39లోని తన కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో బైకుపై వచ్చిన ఒక జంట ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకొని పరారైన విషయం విదితమే. సంఘటనపై కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. వాహన నంబరు ఆధారంగా అది రాపిడోకు అనుసంధానంగా నడుస్తున్నట్లు గుర్తించారు. తద్వారా వాహనం నడిపే వ్యక్తి సెల్‌ఫోన్ నంబరు తీసుకొని సాంకేతికంగా పరిశీలించారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్నట్లు గుర్తించిన పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని మంగళవారం రాత్రి ఏపీ హద్దులో అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. వారిద్దరిని విచారించగా వాహనం నడిపిన యువకుడు(23) గుంటూరు జిల్లా ప్రాంతానికి చెందిన వాడిగా, వాహనం వెనుక కూర్చొని గొలుసు తెంచుకెళ్లిన యువతి(33) పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. తమ అవసరాల కోసం వీరు ఈ స్నాచింగ్‌కు పాల్పడినట్లు తెలుస్తుంది. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తుంది. నిందితులు సనత్‌నగర్ ప్రాంతంలో నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఫిల్మ్‌నగర్ వినాయకనగర్‌లో యువకుల బాహాబాహి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః

ఫిల్మ్‌నగర్‌లోని వినాయకగనర్‌లో బుధవారం యువకులు బాహాబాహికి దిగారు. విద్యార్థుల విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఇరువర్గాలకు చెంది యువకులు వినాయకనగర్‌లో పెద్దఎత్తున చేరారు. తొలుత మాటలతో మొదలై అనంతరం పరస్పరం దాడులు దిగారు. దీంతో వినాయక్ నగర్ ప్రాంతంలో కాసేపు గందరగోళం నెలకొంది. స్థానికులు ఇరువర్గాలను నిలదీయడంతో వారంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొందరు ఈ సంఘటనలను వీడియో తీశారు. విషయం తెలుసుకున్న ఫిల్మ్‌నగర్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో వివరాలు సేకరిస్తున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఇరువర్గాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
కొటేషన్‌లు ఆహ్వానిస్తూ ప్రకటన

NIQ No. 12/EE-II/ఖైరతాబాద్ జోన్/GHMC/2025-26 తేదీ: 18.02.2026.

పని పేరు : వీటికి కొటేషన్‌లు కోరుతున్నారు. PVC నేమ్ ప్లేట్ శతధార బిగించటం. నేమ్ ప్లేట్ లోపల విద్యుత్ లైటింగ్. నీటి ప్రవాహం కోసం టాప్ స్టీల్ ప్లేట్ మరియు బేస్‌తో 100 నాజిల్స్‌తో కూడిన PVC పైప్‌ల సరఫరా మరియు ఫిక్సింగ్. VV విగ్రహానికి పెయింటింగ్ వేయటం. తుప్పుతొలగింపు మరియు క్లీనింగ్. పని పూర్తి కొరకు ధర మరియు రవాణా కలుపుకొని. పోర్టబుల్ రకం నమూనా ఆనకట్ట నిర్మాణం (ఉస్మాన్‌సాగర్ & హిమాయత్‌సాగర్) ఇందులో ఇవి కలిగి ఉంటాయి: i) ఇటుక పని, బాక్స్ పని, RMC అదనపు పటిష్టతతో పుట్టింగ్ ii) అట్టడుగు నుంచి పై టాప్ వరకు అంతటా ఇటుక పని. iii) అవసరమైనట్టుగా టిలి (రాళ్ళు ప్లాస్టరింగ్ మరియు ఫిక్సింగ్ కలుపుకొని. iv) విద్యుత్ మెట్లు, వైరింగ్ కలుపుకొని 2నం.ల పంప్‌లు, DP బాక్స్, విద్యుత్ బాక్స్ మరియు కనక్షన్‌లు. v) సంప్ నిర్మాణం adn కనక్షన్‌లు, సక్షన్ adn పంపింగ్ పని కొరకు పైప్‌లతో కలుపుకొని. vi) నేమ్ ప్లేట్‌లు: డామ్స్ మరియు పెయింటింగ్ వగైరాలపై విద్యుత్ లైటింగ్ కలుపుకొని ఇంజనీరింగ్ అభివృద్ధి ఫోటో టైప్ ఫైబర్ మోడల్ యొక్క వివరాలతో నేమ్ ప్లేట్స్‌తో రెండు హ్యాండీల ఏర్పాటు. టెండర్ ప్రకటన/బిడ్ పిలుపు తేదీ/ప్రత్యేక వివరణలు పొందడం- 18.02.2026 సా.05.00గం. సీల్డ్ కొటేషన్‌ల స్వీకరణ (లేదా)/ బిడ్ దాఖలు గడువు తేదీ మరియు సమయం : 21.02.2026 మ.12.15గం. ప్రి క్వాలిఫికేషన్ మరియు టెక్నికల్ బిడ్స్ తెరచుట: 21.02.2026 మ.12.30గం. గమనిక: ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-II, ఖైరతాబాద్ జోన్, GHMC, ఖైరతాబాద్, హైదరాబాద్ కార్యాలయం నుండి ప్రత్యేక వివరాలు పొందవచ్చును. మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, GHMC, ఖైరతాబాద్ హైదరాబాద్ కార్యాలయంలో సీల్డ్ కొటేషన్‌లు దాఖలు చేయవలెను. అందువలన అన్ని అవసరమైన వివరాలతో పై కాలవ్యవధిలో అర్హులైన ఏజన్సీలు వారి బిడ్ దాఖలు చేయవచ్చును.

సం/-, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఖైరతాబాద్ జోన్, GHMC.

DIPR.NO.15548-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 18.02.2026

IN THE COURT OF THE HON'BLE XXVI ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD.
OS. No. 44 of 2026

Between:
Anuradha Reddy Komatireddy & Ors ...Plaintiff
And
All Concerned & Ors. ..Defendant

Whereas the Plaintiff has instituted the aforementioned suit for Declaration to declare them as the legal heirs of the deceased Late Raghuveer Reddy and to have succeeded to Suit Schedule property and consequently to declare that the Plaintiffs are entitled and permit them to succeed, mutate their names in the revenue / municipal records in respect of Suit Schedule Properties, which belonged to Late Raghuveer Reddy. The Hon'ble XXVI Additional Chief Judge, City Civil Court, at Hyderabad has vide its order dated 31.01.2026 has issued paper publication and posted the above said suit on 03.03.2026. If any person/s having any manner of interest, claim or objection for the relief sought by the Plaintiff in the above suit, is required to attend the Hon'ble Court on 03.03.2026 at 10:30AM either in person or through his/her advocate to put forward his/her claim and the suit will be determined by the Hon'ble Court on the basis of the material available on record.

SCHEDULE 'A' : Flat No. 202 with an area admeasuring 1,965 Sq. Ft (including place under the steps on ground floor and parking place), situated at Vijayaveer Residency, Plot No. 1, Ameerpet, Hyderabad – 500016. North : Staircase and open to Sky, South : Open to Sky, East: Corridor, West: Open to Sky.

Flat No. 501 with an area admeasuring 1,965 Sq. Ft. (including one car parking place) situated at Vijayaveer Residency, Plot No. 1, Ameerpet, Hyderabad – 500016. North : Staircase and open to Sky, South : Open to Sky, East : Corridor, West : Open to Sky.

SCHEDULE 'B' : All that finished independent duplex house with a total built – up area of 6,910 Sft., in Plot No. 14 and 15, totally admeasuring 700 Sq yards., in the layout sanctioned by the Hyderabad Urban Development Authority vide Layout Permit No. 01/MP2/Plg/H/2008 dated 11.01.2008 in File No. 5402/MP2/Plg/H/2007 of HUDA, situated in Sy No. 1 (part) of Sikenderguda village, known as Katta Kinda Bavi, Gandipet Mandal, Ranga Reddy District and bounded as: (A) Plot No. 14, Extent : 350 Sq. Yards, built – up area : 3455 Sft. North : Plot No. 15 South : Plot No. 13 East: 40' wide road West: Park. (B) Plot No. 15, Extent : 350 Sq. Yards, built – up area : 3455 Sft. North: Plot No. 16, South: Plot No. 14, East. : 40' wide road, West : Park.

SCHEDULE 'C': Plot No. 19 admeasuring 267 Sq. Yards, bearing Sy. No. 82/A, AA, E and EE, of Gandhamguda village, Peerancheruvu G.P Rajendra Nagar Mandal, Ranga Reddy District, and bounded as follows: North: 30' internal road, South: Plot No. 19, East: Sy. No. 97, West: 30' internal road.
MRUDULA SARAMPALLY.
(Counsel for Plaintiff)
#301, South

శివాజీ జయంతి వేడుకలకు ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం

నేరేడ్ మెట్, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :
ఈటల రాజేందర్ను నేరెడ్మెట్ డివిజన్ పరిధిలో నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలకు హాజరుకావలసిందిగా నిర్వాహకులు ఆహ్వానించారు.ఆర్కేపురం ప్రాంతంలో ఆదిదేవ్ అసోసియేషన్ మరియు హిందూ వాహిని, అలాగే డిఫెన్స్ కాలనీలో హిందూ ఏకతా యాత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న ఘనంగా నిర్వహించనున్న శివాజీ జయంతి ఉత్సవాల వివరాలను తెలియజేస్తూ ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.సమాజంలో దేశభక్తి భావాలను పెంపొందించే కార్యక్రమాలుగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని, యువతలో చరిత్రపట్ల అవగాహన కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వదించాలని వారు కోరారు.ఈ సందర్భంగా ఆర్‌కే శ్రీను, మహిపాల్ రెడ్డి, కొతపల్లి ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, రమేష్ గౌడ్, శ్యామ్, ఆకారం సాయి, సాయి ప్రవేశ్, మహేష్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి :ఎమ్మెల్యే అహ్మద్ బలాల



యువతకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్ పేట ,ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:
యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. సలార్ కెరియర్ గైడెన్స్, ప్లేస్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసిన యువతకు ఎమ్మెల్యే బలాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం ఇటువంటి శిక్షణ కేంద్రాలను నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా పృథ్వీ గౌడ్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:
కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్, మెడికల్ మరియు హెల్త్ వింగ్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ గా బబ్బూరు పృథ్వీ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్, మెడికల్ మరియు హెల్త్ వింగ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎం.రాజీవ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. రంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్యులను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తానని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి ఎంతో శ్రమిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర సర్కారు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వైద్యులకు తెలియజేసి వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. తనను డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ గా నియమించినందుకు పార్టీ ప్రముఖులకు ధన్యవాదాలు తెలిపారు.

వేసవికాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి : ప్రేమ్ కుమార్

మల్కాజిగిరి ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:
వేసవికాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఈస్ట్ ఆనంద్ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కోరారు. బుధవారం వసంతపురి కాలనీ సెక్షన్ బి జె ఆర్ నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలో పాత వైర్ మార్చి కొత్త వైర్లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసు కోవాలన్నారు. ఏ ఈ గోపాల్ తో కలిసి కాలనీలో పర్యటించారు.బిజిఆర్ నగర్ బస్తీ దవఖాన నుండి ఉప్పలమ్మ గుడి వరకు వైర్లను మార్చడం జరుగుతుందన్నారు దీనివల్ల బిజార్ నగర్ సత్తిరెడ్డి కాలనీ వెంకటేశ్వర్ నగర్ పివిఎన్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సమస్య తీరుతుందన్నారు . ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. వేసవికాలంలో ప్రజలకు ఇబ్బందులు కలవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ కోరారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది రెడ్యానాయక్ ఉపేందర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

మల్కాజ్‌గిరి అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే భేటీ

మల్కాజిగిరి ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:
మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మాను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం వివిధ అంశాలపై వినతిపత్రాలను సమ ర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మల్కా జ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య, క్రీడా మరియు మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లా పరిపాలన సహకారం అందించాలని కోరారు.జిల్లా కలెక్టర్ వినతులను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ స్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ

-ఘనంగా గణపతి హోమం..
-హాజరైన డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

బోడుప్పల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ;
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ లో వెలసిన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో పునఃప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా ఈ రోజు ఘనంగా గణపతి హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమంలో విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తూ, ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి , ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ... ఆలయాలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో సత్సంకల్పాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.పునఃప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా రాబోయే రోజుల్లో వివిధ వేద కార్యక్రమాలు,ప్రత్యేక పూజలు,

శ్రీ సీతారామ ఆంజనేయ స్వామి విగ్రహం పునః ప్రతిష్ఠలో పాల్గొన్న డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, తోటకూర అజయ్ యాదవ్, పోగుల నర్సింహారెడ్డి, ఆలయ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి తదితరులు

అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, సలహాదారులు పోగుల వెంకట్ రెడ్డి, బొమ్మక్ రమేష్ మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, చీరాల నరసింహ్మ , నాయకులు పొన్నం రవి గౌడ్,రాసాల నర్సింగ్ రావు యాదవ్, దానగళ్ళ యాదగిరి, కొత్త కిరణ్ గౌడ్, ఎర్రగుంట్ల సత్యమూర్తి యాదవ్, మన్నె ప్రభాకర్ రెడ్డి , మాజీ ప్రజా ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కమర్షియల్ భవనాల టాక్స్ తగ్గింపులు

-అంతా మన చేతిలో పని
-చేతివాటంలో రెవెన్యూ అధికారులు
-ఎంఎంసి ఆదాయానికి గండి

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
ఇష్టారాజ్యంగా రికార్డులు తయారు చేస్తూ కొందరు అధికారులు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) ఆదాయానికి గండి కొడుతున్నారు. స్వలాభమే ధ్యేయంగా పనిచేస్తున్న అధికారుల వల్ల ఎంఎంసి ఖజానాకు కోట్లాది రూపాయల గండి పడుతుంది. అంతా మన చేతిలో పనే అంటూ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్న కొంతమంది రెవెన్యూ అధికారుల అవకతవకలకు పాల్పడుతున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని గడ్డిఅన్నారం డివిజన్లో ఉన్న కమర్షియల్ భవనాలకు ఆస్తి పన్ను తగ్గిస్తూ బిల్లులు ఇస్తున్నారు. సదరు భవన యజమానులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కై చేతివాటాన్ని ప్రదర్శిస్తూ కమర్షియల్ భవనానికి టాక్స్ తగ్గిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎంఎంసికి వెన్నెముక అయిన రెవెన్యూ విభాగం అధికారుల లీలల కారణంగా ఎంఎంసి ఆదాయాన్ని కోల్పోతుంది. చాలాకాలంగా ఈ ప్రాంతంలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు కమర్షియల్ భవనాల వద్ద యజమానులతో మాట్లాడుకొని సగానికి ఆస్తి పన్ను తగ్గిస్తున్నారు. ఇలా వ్యాపారులు ఒకరికి ఒకరు సమాచారం ఇచ్చుకుంటూ రెవెన్యూ అధికారులతో మాట్లాడుకొని కమర్షియల్ భవనాలకు ఆస్తి పన్ను తగ్గించుకొనే మార్గాన్ని ఎన్నుకున్నారు. ఎంఎంసిలోని రెవెన్యూ అధికారులు చూపిస్తున్న అత్యుత్సాహంతో వందలాది కమర్షియల్ భవనాలకు వాళ్లే మినహాయింపునిస్తూ తక్కువ బిల్లులు పంపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వేలాది కమర్షియల్ భవనాలు ఉన్న దిల్‌సుక్‌నగర్ ప్రాంతంలో ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల ఆస్తిపన్ను వసూలు కావలసి ఉండగా రెవెన్యూ విభాగంలోని కొంతమంది అవినీతి అధికారుల వల్ల ఎంఎంసి ఖజానాకు గండి పడుతుంది. దిల్‌సుక్‌నగర్ ప్రాంతంలోని పలు కమర్షియల్ భవనాలను ఎంఎంసి ఉన్నతాధికారులు పరిశీలించి ఏ మేరకు ఆస్తిపన్ను వసూలు కావలసి ఉందో ప్రస్తుతం వారి వద్ద నుంచి ఏ మేరకు ఆస్తిపన వసూలు అవుతుందో చూడాలని పలువురు కోరుతున్నారు. కొన్ని భవనాలను పరిశీలిస్తే అవినీతి అధికారుల అసలు రంగు బట్టబయలు కావడంతో పాటు ఎంఎంసి ఆదాయం మరింత పెరుగుతుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

దిల్‌సుఖ్‌నగర్ వద్ద వ్యాపార సముదాయాలు

జర్నలిస్టులు సామజిక బాధ్యతతో పనిచేయాలి : మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రంగారెడ్డి యూనిట్ పాత్ర ప్రశంసనియమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే రూపొందించిన రంగారెడ్డి జిల్లా మీడియా డైరీని రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సలీమ్, సత్యనారాయణలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు రూ.5 లక్షల ప్రమాద భీమా కల్పించటంతో పాటు, నియోజకవర్గాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించటం గొప్ప విషయం అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో మృతి చెందిన జర్నలిస్ట్ రాములు కుటుంబానికి అండగా యూనియన్ నిలబడటం మంచి పరిణామం అన్నారు.జిల్లాలో చనిపోయిన జర్నలిస్టుల జాబితా ఇవ్వాలని వారి కుటుంబాలకు అకాడమీ ద్వారా సహాయం అందిస్తాం అన్నారు. అదేవిదంగా మృతి చెందిన జర్నలిస్ట్ ల భార్య లకు 5 సంవత్సరాల వరకు 3 వేల రూపాయల పెన్షన్ తో పాటు, 10 వ తరగతి లోపు చదివే పిల్లలకు ప్రతి నెల ఒక వేయి రూపాయలు ఇవ్వటం జరుగుతుందన్నారు.రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ మాట్లాడుతూ రాష్ట్రం లోనే కాకుండా దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే -ఐజేయూ మాత్రమే అని అన్నారు.రంగారెడ్డి జిల్లాలో విద్య, వైద్య పరంగా యూనియన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ షాబాద్ లో మృతి చెందిన జర్నలిస్ట్ రాములు కుటుంబానికి రూ.8 లక్షల సహాయం అందించటం జరిగిందన్నారు. జిల్లా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సబ్యులు ప్రవీణ్ కుమార్, జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి. నాయకులు జంగయ్య, ఫణింద్ర, భీమయ్య, ఆంజనేయులు, సూర్యనారాయణ, రమేష్, కొండా విజయ్ కుమార్, దామోదర్ రెడ్డి, మధు, దర్శనం జంగయ్య, ఇలియాజ్, సీనియర్ రిపోర్టర్లు కటకం సుభాష్, శేఖర్, తిరుపతిరెడ్డి, శంకర్, రత్నం, యాసీన్, బస్వారాజ్, ఫరీద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ సభలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

బిసిలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి : కటకం

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
బీసీలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు పేర్కొన్నారు. నాగోల్‌లోని మన ఆలోచన సాధన సమితి (మాస్) ప్రధాన కార్యాలయంలో బుధవారం మాస్ కోశాధికారి పెద్దవూర బ్రహ్మయ్య అధ్యక్షతన రజక, ముదిరాజ్, విశ్వకర్మ, మేం కులాలకు సంబంధించిన ప్రతినిధులకు మాస్ లీడర్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దవూర బ్రహ్మయ్య రజక మాట్లాడుతూ కటకం నర్సింగ్‌రావు ఆలోచన నుండి పుట్టిన మన ఆలోచన సాధన సమితి చేసిన కార్యక్రమాలను వివరించి, బీసీలలో నాయకత్వ లోపం ఉన్న దృష్ట్యా, బీసీ కులాలు అనుచరులుగా కాకుండా నాయకులుగా ఎదగాల్సిన ఆవశ్యకత గుర్తించి వివరించారు. బీసీల నాయకత్వ లేమి వలన భూస్వాములు, పెట్టుబడి దారులు, ఆధిపత్య కులాలు వివిధ వ్యాపారాల మాదిరిగానే రాజకీయాలను మార్చుకొని బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా, ఓట్లమ్ముకునే వారిగా, ఓట్లను వేయించే అనుచరులుగా మార్చుకుని మనల్ని పాలిస్తూ ప్రబుత్వ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని రాజకీయ దొపిడీకి పాల్పడుతూ సమాజంలో ఎక్కువగా ఉన్న బీసీలకు అందాల్సిన ప్రతిఫలాలను కొల్లగొడుతూ అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు పోల్కం లక్ష్మీనారాయణముదిరాజ్, ప్రొఫెసర్ అల్లదుర్గం సురేష్‌ముదిరాజ్, సామాజిక కార్యకర్త చీరాల జేలేంద్ర చారి, గారుజక్కుల బాలరాజుయాదవ్, శ్రీగాది కృష్ణయ్య, గూండ్ల ఆంజనేయులుగౌడ్, బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, మంగిళిపల్లి శంకర్‌గంగపుత్ర, కైరంకొండ నర్సింగ్, దువ్వల శ్రీకాంత్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కటకం నర్సింగరావు

చర్చికాలనీలో శరవేగంగా అభివృద్ధి పనులు : రజిత పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ చర్చికాలనీలో రూ.2 కోట్ల 27 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎం. రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చర్చికాలనీలో పలు అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. చర్చికాలనీలో రూ.కోటి 9 లక్షలతో మంచినీటి పైప్ లైన్, భూగర్భ డ్రైనేజీ పనులు, మరో రూ.కోటి 18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఉప్పల్ డివిజన్ పరిధిలోని చర్చి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. కాలనీలో కలుషిత మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.కోటి 9 లక్షలతో వాటర్ పైప్ లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పైపు లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి వెంటనే రూ.కోటి 18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నట్టుగా తెలిపారు.చర్చి కాలనీలో వాటర్ లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను రూ.2.27 కోట్లతో చేపట్టినట్టుగా చెప్పారు. అతి త్వరలోనే ఈ పనులను పూర్తి చేయనున్నట్లు గా తెలిపారు.ఈ కార్యక్రమంలో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీకాంత్ రెడ్డి, చర్చి కాలనీ అధ్యక్షులు జానీ, సుధాకర్, లుకాస్, రత్న రెడ్డి, డేవిడ్, ప్రవీణ్, సతీష్, సునీల్, రోసి మేరి, కార్తీక్, పుష్పాలమ్మ, ఫ్రాన్సిస్, బాలస్వామి, సల్ల ప్రభాకర్ రెడ్డి, సందీప్, భాస్కర్, రాఘవేంద్ర, వల్లపు శ్రీకాంత్ యాదవ్, శాగ శ్రీధర్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

చర్చికాలనీలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

రామంతాపూర్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామంతాపూర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : రామంతాపూర్ లక్ష్మీనగర్ ఫీడర్ పిరధిలోని స్ట్రీట్‌నెం.8 సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ కె.లావణ్య తెలిపారు. సాయిచిత్రనగర్, లక్ష్మీనగర్, ఇఎస్ఐ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ల్యాండ్ మార్క్ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదే విధంగా దూరదర్శన్ ఫీడర్ పరిధిలోని హోమియోపతి కళాశాలలో సరఫరా నిలిపివేస్తారని తెలిపారు. గణేష్‌నగర్ ఫీడర్ పరిధిలోని పాత రామంతాపూర్, శారధనగర్, ఆనంద్‌నగర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నేడు రామంతాపూర్‌లో శివాజీ జయంతి వేడుకలు

రామంతాపూర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : రామంతాపూర్‌లో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని శివాజీ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ తిండేరు హనుమంతరావు తెలిపారు. అసోసియేషన్ స్థాపించి 33 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారీ ఎత్తున వేడుకలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు కొత్త ఇన్‌స్పెక్టర్‌గా మహేష్ కుమార్

తార్నాక, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :
ఉస్మానియా పోలీస్ స్టేషన్‌కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా మహేష్ కుమార్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన అప్పలనాయుడు స్థానంలో మహేష్ కుమార్ నియమితులయ్యారు.2007 బ్యాచ్‌కు చెందిన మహేష్ కుమార్ తన సేవా కాలంలో పలు కీలక ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించారు. గతంలో నాచారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా, నగరంలోని మంగళహాట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా, అలాగే చౌటుప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. పోలీసు శాఖలో విశేష అనుభవం కలిగిన మహేష్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో సమన్వయం పెంచుకుంటూ చట్టపరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

దివ్యాంగుడి కుటుంబానికి కాంగ్రెస్ నేత చేయూత

దివ్యాంగుడి కుటుంబానికి చేయూత అందిస్తున్న కాంగ్రెస్ నేత ఇర్షద్‌ఖాన్ తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : చిలుకానగర్ డివిజన్‌లో నివసించే దివ్యాంగుడి కుటుంబానికి బీరప్పగడ్డ కాంగ్రెస్ పార్టీ నేత ఇర్షద్‌ఖాన్ చేయూత అందించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఇంటికి వెళ్లి తగు ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇర్షద్‌ఖాన్ మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌లో నివసించే పేద దివ్యాంగుడికి పోషణభారంతో ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌పైనే జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అతని కుమార్తె కూడా దివ్యాంగురాలే కావడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇంటర్ ఫీజు చెల్లించేందుకు స్థోమత లేకపోవడంతో స్పందించి తగు చేయూత అందించినట్లు తెలిపారు. విద్యార్థిని ఫీజు చెల్లించి హాల్ టిక్కెట్ ఇప్పించినట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు వారికి అండగా నిలిచినట్లు తెలిపారు. పేదల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఉప్పల్ స్టేడియం రోడ్డుపై ఆయిల్ లీకేజీ

- మట్టిపోసిన పోలీసులు

ఉప్పల్ స్టేడియం రహదారిలో రోడ్డుపై పడిన ఆయిల్‌పై మట్టి పోస్తున్న ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు దృశ్యం.

ఉప్పల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : ఉప్పల్ స్టేడియం నుంచి కల్యాణపురి రహదారిలో బుధవారం డ్రైనేజీ క్లీనింగ్ వాహనం నుంచి ఆయిల్ రోడ్డుపై లీకేజీ అయి ప్రమాదకరంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు నియంత్రణ కోల్పోయి కింద పడే పరిస్థితి నెలకొంది. దీంతో ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ రమేష్, మధుసూధన్‌లు స్పందించి తమ సిబ్బందితో ఆయిల్ పడిన ప్రాంతంలో తమ వాహనం ద్వారా మట్టి పోయించారు. క్రేన్ సహాయకుల సహాయంతో ప్రభావిత ప్రాంతంలో మట్టిని చల్లి, రోడ్డును సాధారణ స్థితికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐలు రమేష్ మరియు మధుసూదన్ ఇతర సిబ్బందిని పలువురు అభినందించారు.

నేడు ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

సమావేశంలో మాట్లాడుతున్న రాధాధీరజ్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:
చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలను గురువారం నిర్వహిస్తున్నట్లు చత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవ సమితి సబ్యులు రాధాధీరజ్‌రెడ్డి, వీరన్నగారి ధీరజ్‌రెడ్డి, పిట్ట ఉపేందర్‌రెడ్డి, రాములుయాదవ్, కొట్టం వెంకటేష్ యాదవ్, సంతోష్ తెలిపారు. ఆర్కేపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శివాజీ జయంతి వేడుకలలో భాగంగా గురువారం సాయంత్రం 6 గంటలకు వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆర్చి వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా అఖిలభారత సామాజిక సమరసతావేదిక నిర్వాహకుడు అప్పల ప్రసాద్ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. స్వరాజ్య స్థాపకుడు ధర్మరక్షకుడు మహా యోధుడైన చత్రపతి శివాజీమహారాజ్ ఆదర్శాలను స్మరించుకుంటూ నిర్వహించే ఈ వేడుకను విజయవంతం చేయడానికి ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొన